క్లుప్తంగా

బాణసంచా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి



బాణసంచా షాపులు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించే వర్తకులు తగిన జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ సూచించారు. శుక్రవారం మొగల్తూరులో బాణసంచా విక్రయించే షాపులు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఆయన పరిశీంలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయాలను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యాపారులు నిర్వహించాలన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కుళాయి చెరువు వద్ద ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలని, ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీరు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఫైర్ ఆఫీసర్ బాస్కర్, ఆర్ఐ రూజ్వెల్ట్ తదితరులు ఉన్నారు.

ముగిసిన రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు



పోషణ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో కిశోర బాలికలు

పాలకొల్లు సెంట్రల్: అంతర్జాతీయ బాలిక దినోత్సవం, 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ మాసోత్సవ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంచిలి, పాలకొల్లు మండలాల కిశోర బాలికలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమ, ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, గుడాలహరిబాబు, ఎంఈఓ శర్మ, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

కాపు నేత బాబ్జికి పరామర్శ



బాబ్జిని పరామర్శిస్తున్న దృశ్యం

నరసాపురం: తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొంది వచ్చిన నరసాపురం పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జిని శుక్రవారం కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ కన్వీనర్ చినమిల్లి వెంటరాయుడు పరామర్శించారు. బాబ్జి యోగక్షేమాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాపు సంఘం నేతలు కోటిపల్లి సురేష్, చెన్నా రమేష్, కావలి నాని, మల్లెపూడి చినబాబు, బళ్ల వాసు ఉన్నారు.

గ్రామసభలో కన్నీరు పెట్టిన మహిళ

పెనుమంట్ర: తన సొంత స్థలంలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటుంటే పక్క స్థలం యజమాని అడ్డుకుంటున్నారని శుక్రవారం సాయంత్రం పెనుమంట్ర గరువు గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన పల్లె పల్లెకు మన పితాని గ్రామసభలో అదే గ్రామానికి చెందిన కొనకల్ల వెంకట నరసమ్మ అనే మహిళ కన్నీరు పెడుతూ గ్రామ సభలోఎమ్మెల్యే ఎదుట తన ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం ఉదయం పాలమూరు గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, సాయంత్రం పెనుమంట్ర గరువు గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. దీంతో సంఘటన స్థలానికి వెళ్లి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామపంచాయతీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తహసీల్దార్ రవికుమార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పైథాన్ వర్క్‌షాప్



విద్యార్థులతో యాజమాన్యం, అధ్యాపకులు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో గత మూడు రోజులుగా సాగుతున్న పైథాన్ వర్క్‌షాప్, ఒకరోజు హ్యాకథాన్ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు హ్యాకథాన్‌లో ఆటోమేషన్, డేటా విజువలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులతో విద్యార్థులు తమ సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివశివా.. రేవులు ఇలా.. స్నానాలు ఎలా?



ఎర్రవంతెన దగ్గరలో చెత్తతో దారుణంగా ఉన్న రేవు



బ్రాడీపేట బైపాస్ రోడ్డు ఎదురుగా ఉన్న స్నానాల రేవు దుస్థితి



వీరహనుమాన్ థియేటర్ రోడ్డు ఎదురుగా ఉన్న స్నానాల రేవు ఇలా

- అధ్వానంగా కాలువ గట్టు రేవులు
- కార్తీక స్నానాలంటేనే భయపడుతున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లులో మరో నాలుగు రోజుల్లో కార్తీకమాసం పూజలు ప్రారంభం కానున్నాయి. కార్తీకమాసం నెల రోజులు భక్తులు వేకువజామునే లేచి కాలువ వద్దకు వెళ్లి స్నానాలు ఆచరించి దగ్గరలో ఉన్న ఆలయంలో స్వామివార్లు, అమ్మవార్లను దర్శించుకుని రావి, మర్రి, వేప చెట్లు, తులసి మొక్కల వద్ద కార్తీక దీపాలను వెలిగించి అనంతరం కాలువల్లో దీపాలను వదులుతుంటారు. పట్టణంలో ప్రవహించే నరసాపురం–నిడదవోలు ప్రధాన కెనాల్‌కు పట్టణ పరిధిలో సుమారు 18 వరకూ రేవులు ఉన్నాయి. ఇందులో 5 రేవుల మాత్రమే భక్తులు స్నానాలు చేసేందుకు అనుకూలంగా ఉంటున్నాయి. మిగిలిన రేవులు మలమూత్ర విసర్జనలతో పాటు చెత్త చెదారాలతో అత్యంత దారుణంగా ఉంటున్నాయి. ఈ రేవుల వద్ద స్నానాలు చేయాలంటేనే మహిళలు హడలిపోతున్నారు. రేవులు బాగుచేస్తే మాత్రం మెట్లు స్నానాలకు ఎంతో అనుకూలంగా, శుభ్రంగా ఉంటాయి. కాలువలో నీళ్లు ఎక్కువగా ఉంటే గట్టుపైనే స్నానాలు చేస్తారు. నీళ్లు తక్కువగా ఉంటే కొంచెం లోపలకి దిగాల్సిన పరిస్థితి వస్తుంది. అలాంటి సమయంలో స్నానాలకు దిగే భక్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రేవుల వద్ద కింద ఫ్లోరింగ్ చేసి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేసి ఐరన్ రాడ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధ్వానంగా దుస్తులు మార్చుకునే గదులు

రేవుల వద్ద మహిళలు దుస్తులు మార్చుకోవడానికి డ్రెస్సింగ్ రూములు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం వాటిని శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే ఆ రూముల్లో ఫ్లోరింగ్ ఇసుకతో ఉండడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని శుభ్రం చేయించాలని కోరుతన్నారు. అలాగే తెల్లవారుజామున చీకట్లో వచ్చే మహిళల కొరకు వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో కాలువ గట్లు, రేవుల వద్దే మలమూత్ర విసర్జనలు చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి రేవులను శుభ్రం చేయించాలని కోరుతున్నారు. ప్రధాన రేవుల వద్ద మునిసిపల్ అధికారులు ఈ నెలరోజులైనా ఎవరూ మలమూత్ర విసర్జనలు చేయకుండా హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని భక్తులు వేడుకుంటున్నారు.

స్నానాల రేవులను శుభ్రం చేయాలి



కాలువ రేవుల వద్ద స్నానం చేద్దామంటే చెత్తచెదారంతో అత్యంత దారుణంగా ఉంటున్నాయి. బాగున్న రేవుల్లో మహిళలు ఎక్కువగా ఉంటున్నారు. బ్రాడీపేటలో ఉన్న మూడు రేవుల్లో రెండు అధ్వానంగా ఉన్నాయి. ఈ కార్తీకమాసంలో స్వాములు, కార్తీకమాసం చేసే భక్తులు అధికంగా స్నానాలకు వస్తుంటారు. అధ్వానంగా ఉన్న స్నానాల రేవులను శుభ్రం చేయిస్తే భక్తులకు, స్వాములకు వెసులుబాటుగా ఉంటుంది.

– వర్ధినీడి బ్రహ్మాజీ, పాలకొల్లు

అధ్వానంగా రేవులు



కార్తీక మాసంలో కాలువకు స్నానానికి వెళ్లాలంటే దగ్గరగా ఉన్న రేవు చూసుకుంటాం. దగ్గరలో ఉన్న రేవులు మరీ అధ్వాన్నంగా ఉంటున్నాయి. బాగున్న రేవులు వద్ద లోతు ఎక్కువగా ఉంటుంది. ఎర్రవంతెన వద్ద ఉన్న రేవు భక్తులతో రద్దీగా ఉంటుంది. ఆ పక్కనే ఉన్న రెండు రేవులు అత్యంత అధ్వాన్నంగా ఉంటున్నాయి. అవి కూడా బాగుచేస్తే భక్తుల రద్దీ తగ్గుతుంది. అక్కడ దుస్తులు మార్చుకునే గదులను కూడా శుభ్రం చేయించాలి.

– వేమన విజయలక్ష్మి, కాపు వనిత క్లబ్ మాజీ ప్రెసిడెంట్, పాలకొల్లు

వార్తలు రాస్తే పత్రికా స్వేచ్ఛను హరిస్తారా?

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా పని చేసేవి పత్రికలు, న్యూస్ చానల్స్ అని అలాంటి పత్రికలు ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్ల గురించి వార్తలు రాస్తే కేసులు బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తారా? అంటూ పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు ముక్తకంఠంతో ప్రశ్నించారు. శుక్రవారం పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నున్నబోయిన దుర్గకు ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు స్వస్తి పలికి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యంపై వార్తలు ప్రచురించిన కథనాల విషయంలో సాక్షి దినపత్రికపై, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా గత నాలుగురోజులుగా వేధింపులకు గురిచేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని మండిపడ్డారు. హైదరాబాద్ సాక్షి కార్యాలయం వద్ద ఎడిటర్ ధనుంజయరెడ్డికి నోటీసులు అంటూ ఇప్పటికి 170 ప్రశ్నలను సంధించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. అన్నింటికి వెంటనే సమాధానం చెప్పాలంటూ వేధింపులకు గురి చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సెక్రటరీ ఎంఎస్‌వి సాంబశివ రావు, ట్రెజరర్ తోట రాంబాబు, సభ్యులు బండి శ్రీనివాసు, పిటి వెంకటేశ్వరరావు, మద్దా లాజరస్, కూనపరెడ్డి చిన్ని, రాపాక రవిబాబు, జంపన ప్రసాద్, కర్రా నాయుడు, మండెల అప్పలరాజు, వెంకట్, భాను, బాలాజీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



పులి శ్యామ్

నరసాపురం: స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నెలవారీ సమావేశంలో భాగంగా శుక్రవారం స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సైబర్ నేరాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్పేజ్ ఇండియా వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా రాష్ట్ర కోఆర్డినేటర్ పులి శ్యామ్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మోసగాళ్ల వలలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వయో వృద్ధుల మానసిక ఆరోగ్య శ్రేయస్సుపై రాజమండ్రికి చెందిన ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ కోలా అమూల్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘ సెక్రటరీ శిలార్ సాహెబ్, కోశాధికారి పితాని సత్యనారాయణ, సంభ్యులు సలాది రామారావు, శిరిగినీడి భవాని శంకర్, చామర్తి సుబ్బారావు, పొన్నాడ సుబ్రహ్మణ్యం, సరస్వతీరావు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: మాట నిలబెట్టుకోని కూటమి ప్రభుత్వాన్ని కౌలు రైతులంతా నిలదీయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. కౌలురైతుల సమస్యలపై శుక్రవారం నరసాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పేరుతో ఇచ్చే పంటకు పెట్టుబడి సాయం వాస్తవ కౌలురైతులకు ఇవ్వకుండా భూస్వాములకు ఇవ్వడం పని చేసేవాడికి దెబ్బ తగిలితే కూర్చున్న వాడికి కట్టు కట్టినట్లుగా ప్రభుత్వ విధానం ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం పంట నమోదు ఆధారంగా కౌలు రైతులందరికీ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, రిజర్వుబ్యాంక్ రూల్స్ ప్రకారం రూ.2 లక్షలు బ్యాంకు రుణం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు కవురు శ్రీనివాస్, నెక్కంటి శ్రీనివాసు, పిల్లి కామేశ్వరరావు, యాండ్ర హనుమంతరావు, కడలి ఆంజనేయులు, కవురు వానబాలుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

పాలకొల్లు సెంట్రల్: దేశభాషలందు తెలుగు లెస్స అంటూ తెలుగు భాష గొప్పతన్నాన్ని విశ్వవ్యాప్తంగా తెలియజేసిన సాహితీ ప్రియుడు, కవిసార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు అని వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకట్రాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయలు 496వ వర్ధంతి సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఉన్న రాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెనుమాక రామ్మోహనరావు, వంగా నరసింహరావు, కానూరి ప్రభాకర్, గుండుమోగుల వీరాస్వామి, కొట్టి భాస్కర రావు, విస్సా సుబ్బారావు, బోనం మునసబు, మండెల పణి, రాయి సూరిబాబు, కొండ్రెడ్డి సూరిబాబు, చవ్వాకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ రాఘవులు మృతి



రాఘవులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ మునిసిపల్ మాజీ కౌన్సిలర్ డాక్టర్ సిరితోటి రాఘవులు (88) శుక్రవారం వేకువజామున వృద్ధాప్య సమస్యలతో మృతి చెందారు. ఈయన 1999 నుంచి 2004 వరకూ పాలకొల్లు మునిసిపల్ ఫ్లోర్‌లీడర్‌గా పని చేశారు. గతంలో ప్రభుత్వ వైద్యుడిగా వివిద గ్రామాల్లో పనిచేసి పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం రైటైర్డ్ పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతిపై పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు.

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం



సారవ గ్రామంలో రచ్చబండ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: పాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాద రాజు అన్నారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సారవ గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు రచ్చబండలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వాలే విద్య, వైద్యం అందించాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్షించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెడిక్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పీడీ రాజు, నరసాపురం మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్ నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొల్లాబత్తుల రవి కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కడలి రాంబాబు, తిరుమాని కృష్ణంరాజు, నియోజకవర్గ ఇంటెలెక్చ్యువల్ విభాగ అధ్యక్షుడు పులపర్తి ప్రతాప్, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు అద్దాల నరసింహరావు, మండల కమిటీ సభ్యులు తిరుమాని సత్యనారాయణ, మైలబత్తుల శ్రీను, కంకటాల పెద్దిరాజు, కడలి అబద్ధం, కవురు మహేశ్వర రావు, బిల్లు బ్రదర్స్, గ్రామధ్యక్షుడు మండపాటి వెంకటేశ్వర రావు, సిద్దినిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొడి చెత్తను మాత్రమే ఇవ్వాలి

నరసాపురం: మున్సిపాలిటీకి డంపింగ్ యార్డు సమస్య తలెత్తిన దృష్ట్యా కొన్ని రోజుల పాటు ప్రజలు పొడి చెత్తను మాత్రమే మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయ న ఓ ప్రకటన విడుదల చేశారు. గోదావరి గట్టున చెత్తను వేయవద్దని గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ స్థలా ల్లో చెత్తను డంప్ చేయడానికి స్థానికులు అభ్యంతరాలు తెలుపుతున్నారని వివరించారు. ఇటీవల 28వవార్డులో మున్సిపల్ స్థలంలో చెత్తనువేసే ప్రయ త్నం చేయగా, స్థానికులు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం చెత్తను డంప్ చేసే జాగా లేదని, తడి చెత్తను ఎవరి ఇళ్లలో వారే కంపోస్ట్‌గా సద్వినియోగం చేసుకుని, కేవలం పొడి చెత్తను మాత్రమే అందించాలని కోరారు.

23న మెగా వైద్య శిబిరం

యలమంచిలి: స్థానిక శ్రీ పుంతల ముసలమ్మ కాపు కల్యాణ మండపంలో పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిబిరంలో భీమవరం మిత్ర మెడికేర్ హాస్పటల్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని వివరించారు. థైరాయిడ్, ఊపిరితిత్తులు, జనరల్, వెరికోస్ వెయిన్స్, స్త్రీల సమస్యలు, మోకాలి, భుజం, మెడ, వెన్నముక, కంటి పరీక్షలు, పిల్లల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ మెగా వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారని, పరిసర ప్రజలంతా ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రక్షణ గోడ నిర్మాణంలో నాణ్యత పాటించాలి



పీఎంలంకలో రక్షణ గోడను పరిశీలిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని పెదమైనవానిలంకలో సముద్రపు కోత నివారణకు చేపట్టిన రక్షణ గోడ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు బి.బలరాం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు రక్షణగోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ నిర్మాణానికి నాసిరకం రాళ్లను వినియోగిస్తున్నట్లు స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. నిర్మాణ పనులపై ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ తగిన విధంగా లేదని విమర్శించారు. ఈ పనులకు 2022 లో శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటికీ 20 శాతం పనులు కూడా పూర్తి కాలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, గ్రామ కమిటీ సభ్యులు తిరుమాని వెంకటేశ్వరరావు, తిరుమాని రామకృష్ణ, తిరుమాని ఏడుకొండలు, శంకరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. గోతిలోనే..!



పైన మూతలు లేకుండా బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్

నరసాపురం: స్థానిక బస్టాండ్ వద్ద డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలులేవు. నిత్యం వేలాదిమంది ఈ మార్గం మీదుగా ప్రయాణిస్తారు. అలాంటి ఈ మార్గంలో పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం. గతేడాది మేనెలలో పక్కనున్న డ్రెయిన్‌ను బాగు చేసి, మూతలు తీశారు. పని పూర్తయిన తరువాత, తిరిగి మూతలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. ఏడాదిన్నర దాటుతున్నా ఇక్కడ ఇదే పరిస్థితి. డ్రెయిన్‌పై మూతలు లేకపోవడంతో అనేక మంది, గోతుల్లో పడి కాళ్ళు, చేతులు విరగొట్టుకుంటున్నారు. అసలే ఈ డ్రెయిన్ పూర్తిగా శిథిలమై ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సంస్థ, భీమవరం విష్ణు దంత వైద్యశాల ఆధ్వర్యంలో పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు ప్రారంభించారు. శిబిరంలో 600 మందికి దంత వైద్య పరీక్షలు చేశారు.

సుప్రీం కోర్టు జడ్జిపై దాడి చేసిన వారిని శిక్షించాలి



పాలకొల్లు సెంట్రల్: వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



నరసాపురం రూరల్: తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: సుప్రీంకోర్టు జడ్జి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్, బాబూజగజ్జీవనరామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ దుర్గకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగినదాడిగా అభివర్ణించారు. ఈ దాడికి పాల్పడిన లాయర్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ సంఘటనపై ఈ నెల 23న చలో అమరావతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఉల్లంపర్తి ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పసల బోసు, పసుపులేటి నందబాబు, శేఖర్ బాబు, ఇజ్రాయెల్, లక్కవరపు శ్రీను, సిద్దుల గాంధీ, ఖండవల్లి శేఖర్, ఒరిగేటి వరుణ్, లక్కవరపు ఏసు, కొండేటి వరదరాజు, సనమండ శాస్త్రి, లంక చిరంజీవి, కానపాల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

నరసాపురం రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ సుగుణ సంధ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలం శ్రీను, నరసాపురం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తెన్నేటి శేఖర్, మెరిపే మోజేసు, నరసాపురం పట్టణ అధ్యక్షుడు కొడమంచిలి దాసు, కారుమంచి హరిబాబు, వెంకట్రావు, ఝాన్సీ, జేమ్స్ రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.